



సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు అడ్డంకి

సంక్షేమ పథకాలన్నింటికి ప్రభుత్వం రేషన్ కార్డును తప్పనిసరి చేసింది. నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి రేషన్ కార్డును లింక్ చేసింది. రేషన్‌కార్డు లేని నిరుద్యోగులు పథకానికి దూరమవుతున్నారు. దాదాపు ఐదేళ్ల క్రితం కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా అప్పటి నుంచి రేషన్ కార్డు కోసం అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకానికి రేషన్ కార్డుతో లింకు పెడతుండడంతో కార్డులు లేని వారికి శరాఘాతంగా మారింది. తాజాగా రాజీవ్ యువ వికాసం పథకానికి కూడా రేషన్ కార్డుతో లింకు పెట్టింది. దీంతో రేషన్ కార్డులు లేని నిరుద్యోగులు ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తున్నది. రేషన్ కార్డులు ఇప్పుడు ఇస్తాం.. అప్పుడు ఇస్తాం.. అంటూ ఊరిస్తున్న ప్రభుత్వం ఏడాదిన్నర గడుస్తున్నా కార్డులు జారీ చేయకపోవడంతో అనేక మంది ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.

- గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యానికి నోచుకోని అర్హులు
- రాజీవ్ యువ వికాసానికీ రేషన్ కార్డులతో లింక్
- దరఖాస్తు చేసుకోలేకపోతున్న నిరుద్యోగులు
- ఏడాది కాలంగా జారీ కానీ రేషన్ కార్డులు
- గత ప్రభుత్వ హయాంలో 2021లో జారీ

కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు..

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా 50 శాతం వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి యూనిట్‌ను బట్టి 40 నుంచి 80 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు రాకపోయినా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు విధించారు. ఏ జిల్లాకు ఎన్ని యూనిట్లు ఇవ్వాలనే టార్గెట్లు కూడా ప్రకటించ లేదు. గతంలో ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటాను వెబ్‌సైట్ నుంచి తొలగించకపోవడంతో కొత్తగా దరఖాస్తులు ఎంట్రీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకానికి కూడా రేషన్ కార్డుతో ముడి పెట్టడంతో కార్డులు లేని వాళ్లు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ కార్డు లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే స్వీకరించడంలేదని పలువురు నిరుద్యోగులు తెలిపారు.

అన్ని పథకాలకు రేషన్ కార్డుతో లింకు..

ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు రేషన్ కార్డుతో ముడి పెట్టడం కార్డుల లేని వారికి శాపంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో చివరగా 2021లో కొత్త రేషన్ కార్డులను జారీ చేశారు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులను జారీ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం చేపట్టిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల్లో ఐదు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం రేషన్‌కార్డులు లేని వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు కార్డులను జారీ చేయలేదు. ఈ ఏడాది జనవరి 26వ తేదీన పైలట్ ప్రాజెక్టులో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి కార్డులను జారీ చేసింది. గ్రామ, పట్టణ సభల్లో కొత్తగా మరిన్ని దరఖాస్తులు స్వీకరించారు. మీసేవా కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ కొత్త కార్డులను జారీ చేయడంలో ప్రభుత్వం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నది. ఇప్పుడు, అప్పుడు అంటూ

(మిగతా 8వ పేజీలో)

ఫటాఫట్

రైతులకు రూ.40 కోట్ల రుణాలు చెల్లించాం

బూరుగు సంతోష్, సీఈవో

ఆంధ్రజ్యోతి: సుల్తానాబాద్ సొసైటీ పరిధిలో రైతులకు ఏ మేరకు రుణాలు ఇచ్చారు?

సీఈవో: రైతులకు అన్ని రకాల రుణాలకు సంబంధించి రూ 40 కోట్ల రుణాలు ఇచ్చాం. ఇందులో ఎల్‌టీ రుణాల కింద రూ.25 లక్షలు అందజేశాం. ఈ ఏడాది పంట రుణాల కింద 1029 మందికి రూ.9 కోట్ల 25 లక్షలు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: వానాకాలంకు సంబంధించి ఏ మేరకు ధాన్యం కొనుగోలు చేశారు?

సీఈవో: పలు గ్రామాల నుంచి రైతుల వద్ద 94 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రూ.21 కోట్ల 96 లక్షలు రైతులకు చెల్లించాం.

ఆంధ్రజ్యోతి: సన్న ధాన్యానికి సంబంధించి బోనస్ ఎంత ఇచ్చారు?

సీఈవో: 742 మంది రైతులు సన్న ధాన్యం విక్రయించగా వారికి రూ.2 కోట్ల14 లక్షలు రైతుల ఖాతాలో బోనస్ జమ చేయించాం. అలాగే 2,839 మంది రైతులకు రూ.15 లక్షల 46వేల989 ఆరు శాతం డిపెండెంట్ కింద జమ చేశాం.

- సుల్తానాబాద్

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, హన్మాన్ దీక్షాపరులు

8

ఆశా వర్కర్ల నిరసనలు



కమాన్‌పూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీలకు వాటా ఏది
పార్లమెంట్‌లో ఎంపీ వంశీకృష్ణ



గోదావరిఖని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో ఎస్‌సీ వాటా ఏదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మంగళవారం పార్లమెంట్‌లో ప్రసంగించిన ఆయన దేశంలో దళితుల అభివృద్ధి ఎక్కడ కనిపిస్తుందని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ప్రకారం దళితుల విద్య, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించాలని, సామాజిక అన్యాయాల నుంచి రక్షణ కల్పించాలన్నారు. దళితులు దేశంలో 16శాతం ఉంటే బడ్జెట్‌లో మాత్రం కేవలం 3.25శాతం నిధులు కేటాయించారని, మా వాటా ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. దేశ జీడీపీకి తెలంగాణ 36శాతం వాటా ఇస్తుంటే 15శాతం నిధులు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది అన్యాయమన్నారు. పెద్దపల్లి అభివృద్ధికి రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో బీపీఓ కేంద్రం ఏర్పాటు చేయాలని, చెన్నూర్‌లో టెక్స్‌టైల్స్ పార్కు పెట్టాలన్నారు. ఎన్‌టీపీసీ, సింగరేణి విస్తరణలో కొత్త ఉద్యోగాలు కల్పించాలని, ధర్మపురి, రామగిరి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. దళితుల కోసం కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు కేటాయించాలని కోరారు.

పటిష్టమైన నిఘాతో గంజాయిని నియంత్రించాలి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

- నేర సమీక్ష సమావేశంలో సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి గంజాయిని నియంత్రించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. గంజాయి రవాణా, సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. మంగళవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ అధికారి చట్టబద్ధంగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యకలాపాలపై సేషన్ అధికారులకు ముందస్తు సమాచారాలు ఉండాలని, ప్రతి కేసులోను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. తద్వారా నేరాలను నియంత్రించవచ్చని ఆయన సూచించారు. దొంగతనాల నివారణకు నిరంతరం పెట్రోలింగ్ చేయాలన్నారు. సంఘటన స్థలానికి అధికారులు తప్పనిసరిగా వెళ్లాలని, అప్పుడే క్షేత్రస్థాయిలో సమాచారం లభిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో విలేజీ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గంజాయి స్వాధీనం కేసుల్లో ప్రతిభకనబరిచిన అధికారులు, సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు. డీసీపీలు కరుణాకర్, భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖనీ ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏసీపీలు మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐలు, ఎస్‌ఐలు, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులకు కార్పొరేట్ గాలం

పది పరీక్షలు ఇంకా పూర్తికాలేదు... అప్పుడే కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులకు గాలం వేస్తున్నాయి... జిల్లా నుంచి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌లోని కళాశాలల్లో చేర్పిస్తారు... ఆయా కళాశాలల యాజమాన్యాలు ఏజెంట్లను నియమించుకున్నాయి. వారు పదో తరగతి విద్యార్థుల ఫోన్ నంబర్ల జాబితాను తీసుకొని తమ కళాశాలలో చేర్పించాలని ఫోన్లు చేస్తున్నారు... పరీక్షలు పూర్తికాక ముందే ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారు...

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

- రంగంలోకి దిగిన ఏజెంట్లు
- రాయితీలు ఇస్తామంటూ ఆఫర్లు
- పరీక్షలు కాక ముందే ముందస్తు అడ్మిషన్లు

ప్రైవేట్ విద్య వ్యాపారంగా మారింది. తమ పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లో చదివించాలనే తల్లితండ్రుల బలహీనతను యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. రంగు రంగుల బ్రోచర్లు ముద్రించి కమీషన్ ఏజెంట్లను నియమించుకుని ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారు. విద్యా సంవత్సరం ఆరంభానికి ఆరు మాసాల ముందు నుంచే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల చిరునామాలు, తల్లితండ్రుల సెల్ ఫోన్ నంబర్లు సేకరించి ముందస్తు అడ్మిషన్ల కోసం మైండ్ వాష్ చేస్తున్నారు. ఇప్పుడు అడ్మిషన్లు తీసుకుంటే ఫీజుల్లో రాయితీలు ఇస్తామని, పదో తరగతి పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రవేశాలు దొరకవంటూ తల్లితండ్రు లను కలిసి గాలం వేస్తున్నారు. ముందస్తుగా అడ్మిషన్లు చేయడం విరుద్ధమని తెలిసినా కూడా కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు యేటా అదే పద్ధతిని కొనసాగి స్తున్నాయి.

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం పారిశ్రామిక ప్రాం తం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, వివిధ మండ లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 7393 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. వారి వివరాలు, తల్లితండ్రుల సెల్ ఫోన్ నంబర్లను నాలుగు మాసాల క్రితమే సేకరించి అడ్మిషన్ల కోసం తరచూ ఫోన్లు చేస్తూ ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో కార్పొరేట్ కళాశాలల ఆఫర్లకు లొంగిపోయి అడ్మిషన్లు చేస్తున్నారు. అడ్మిషన్ల కోసం తిరుగుతున్న ఏజెంట్లకు ఒక్కో అడ్మిషన్‌కు 3 వేల నుంచి 5 వేల రూపాయల వరకు కమీషన్లు ఇస్తున్నారు. అలాగే ఆయా కళాశాలల్లో విద్యా బోధన చేస్తున్న అధ్యాపకులకు సైతం టార్గెట్లు పెట్టి అడ్మిషన్ల కోసం తిప్పుతున్నారు. వారికి వేతనాలతో పాటు కమీషన్లు కూడా ఇస్తున్నారు. దీంతో డబ్బులకు ఆశపడి ఏజెంట్లు విద్యార్థులను ఆయా కళాశాలల్లో చేర్పించేందుకు కసరత్తును మొదలుపెట్టారు.

ప్రధానం గా హైదరాబాద్‌లో ఉండే కార్పొరేట్ కళాశాలలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల ఆయా ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు ముందుస్తుగా అడ్మిషన్లు చేపడుతున్నారు. ఇంటర్‌లో కోరిన బ్రాంచ్‌లో సీటు ఇప్పిస్తామంటూ ఆఫర్లు ఇస్తున్నారు. పదో తరగతి ఫలి తాలు రాకముందే ఆడ్మిషన్ తీసుకుంటే తక్కువ ఫీజు ఉంటుందని ఆ తర్వాత ఫీజులు పెరుగుతాయని నమ్మ బలుకుతున్నారు. జిల్లాలో ఇప్పటికే చాలా మంది విద్యా ర్థులు చాలా కళాశాలల్లో అడ్మిషన్లు పొందినట్టు సమా చారం. అడ్మిషన్ తీసుకునే వరకు కమీషన్ ఏజెంట్లు విద్యార్థుల తల్లితండ్రులను కాకా పడుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచన చేయాలి..

ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకునే ముందు విద్యిర్థుల భవిష్యత్తు గురించి తల్లితండ్రులు ఆలోచన చేయాలి. పదో తరగతి పరీక్షల సమయంలోనే కార్పొరేట్ కళాశాలల ఏజెంట్లు అడ్మిషన్లు తీసుకునే వరకు వెంట బడుతుంటారు. మరో 10 రోజుల్లో ఫలితాలు వసా_ యని, ఇప్పుడే అడ్మిషన్లు తీసుకోవాలని తల్లితండ్రులను విసిగిస్తుంటారు. వారి బాధ భరించలేక ఏ కళాశాల అయితే ఏమవుతుందిలే అని అడ్మిషన్లు తీసుకుంటే చేతులారా తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేసిన వాళ్ల అవుతారు.. ఒకసారి కాలేజీల్లో చేరితే తర్వాత ఎవరూ పట్టించుకోరు. యేటా ఏజెంట్లు అడ్మిషన్ చేయించడం ఆ తర్వాత వారు వెళ్లిపోవడం షరా మామూలుగా జరుగుతున్నది. కార్పొరేట్ కళాశాలలో చేర్పించే ముందు విద్యార్థుల అభిప్రాయాలతో పాటు కళాశాలలో విద్య నాణ్యత, బోధన చేస్తున్న వారి అను భవం, ఆ కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి. హాస్టల్‌లో ఉంచినట్లయితే పనతులపై ఆరా తీసిన తర్వాతనే అడ్మిషన్ తీసుకోవాలి. తమ విద్యా వ్యాపారం కోసం మసి పూసి మారేడు కాయ చేస్తున్న కళాశాలలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కళాశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే విద్యార్థి తీవ్ర ఒత్తిడికి గురై మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు లేకపోలేదు. కార్పొ రేట్ కళాశాలల ఏజెంట్ల మాయలో పడి తమ పిల్లల భవిష్యత్తును అగాధంలోకి నెట్టి వేయకుండా తల్లితం డ్రులు ముందు చూపుతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాలుగు మాసాల నుంచి ఫోన్లు..

ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు నాలుగు మాసాల నుంచి ఫోన్లు చేస్తూ విసిగిస్తున్నారు. ఎవరైన తల్లిదండ్రులు పరీక్షల ఫలితాలు రాక ముందే ఎలా చేర్పించాలని ప్రశ్నిస్తే మీ పిల్లలు బాగానే చదువుతారని తమకు సమాచారం ఉందని, మా కళాశాలలో చేర్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఊదర గొడుతున్నారు. ఒక్కోసారి కళాశాలల యాజమానులతో తల్లితండ్రులకు మాట్లాడిస్తున్నారు. పదో తరగతి ఫలితాలతో సంబంధం లేకుం డా తాము చేర్పించుకుంటామని, ఒకవేళ పాస్ కాకపోతే చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ముందుగానే సీటు రిజర్వు చేసుకోకపోతే ఆ తర్వాత కోరిన బ్రాంచ్ దొరకదని ఆందోళనకు గురి చేస్తున్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకొని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల బడ్జెట్ తయారీపై అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయ వనరులపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకోవలసిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే వార్డులు డివిజన్లలో మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. వంద శాతం పన్నుల వసూలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు. పట్టణాలలో ఆదాయ మార్గాలు పెంచుకునేందుకు అవసరమైన చోట అసెస్మెంట్ చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యయాలు తగ్గించుకుంటూ, ఆదాయాన్ని జాగ్రత్తగా వాడుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల విలీనానికి అసెంబ్లీలో ఆమోదం

కోల్‌సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పరిసర గ్రామాల విలీన ప్రతిపాదనకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. సోమవారం అసెంబ్లీలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం పరిధిలోని 79గ్రామ పంచాయతీల్లో మున్సిపాలిటీల్లో విలీనం చేసే బిల్లును ఆమోదించారు. ఇందులో రామగుండం నగరపాలక సంస్థలో పరిసర గ్రామాలైన మూడు మండలాలకు చెందిన గ్రామలను విలీనం చేశారు. పాలకుర్తి మండలం ఎల్కలపల్లిగేట్, రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లి, అంతర్గాం మండలం లింగాపూర్, కుందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అక్బర్‌నగర్‌లను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నది. ఈ గ్రామ పంచాయతీల పరిధి ఇక కార్పొరేషన్‌లోకి రానున్నాయి.

డయాగ్నోస్టిక్ కేంద్రాల తనిఖీ



డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రసన్న కుమారి

పెద్దపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలోని ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాలు, ఆసుపత్రులను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ జి అన్నా ప్రసన్న కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శాంతి నగర్‌లోని లక్ష్మీ శ్రీనివాస డయాగ్నోస్టిక్ అండ్ ఇమేజింగ్ సెంటర్, కమాన్ రోడ్ లైన్‌లో గల ప్రైమ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లింగ నిర్ధారణ చెప్పడం చట్టరీత్యా నేరమని బోర్డులు అందరికి అగుపడేలా పెట్టాలని అన్నారు. నక్షత్ర కంటి దవాఖానా, మల్లికార్జున హాస్పిటల్, తిరుమల హాస్పిటల్, అనీస్ హోమియో క్లినిక్‌లను తనిఖీ చేశారు. ధరల పట్టిక ప్రకారం మాత్రమే ఫీజు తీసుకోవాలని అన్నారు. అగ్నిమాపక చర్యలు చేపట్టాలన్నారు. బయో మెడికల్ వేస్టేజ్‌ను ప్రాపర్‌గా డిస్పోజ్ చేయాలన్నారు.

ఆకట్టుకున్న ఏక్ భారత్ శ్రేష్ట



పెద్దాపూర్ ఆదర్శపాఠశాలలో విద్యార్థుల నృత్యప్రదర్శన

పెద్దపల్లి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హర్యానా రాష్ట్రంలోని వారి భాష సంస్కృతులు, నృత్యాలు వేషధారణ, వారి భాష గూర్చి రాష్ట్రంలోని విద్యార్థులకు తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏక్ భారత్ శ్రేష్ట కార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం పేర్కొన్నారు. హర్యానా రాష్ట్ర సాంప్రదాయం, చరిత్ర తెలియజేస్తూ విద్యార్థులు చేసిన జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకొంది.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్‌లోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఏక్‌భారత్ శ్రేష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు హర్యానా రాష్ట్రంలోని ప్రజల జీవన విధానం, ఆహారపు పద్ధతులు, వంటకాలు, సాంస్కృతిక సాంప్రదాయాలను తెలిపే విధంగా చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకొంది. ఉత్తమ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్‌పాల్ ఎండి షాదుల్, అమ్మఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడకతో సమూహమై..
సమాజహితమై...
6

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు. కొమురయ్య అనే వ్యక్తి లబ్ధిదారుల వద్ద నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అతని వద్ద నుంచి క్వింటాల్‌న్నర బియ్యాన్ని స్వాధీనం చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ మోటార్ అపహరణ

చందుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఎర్రవెల్లి రాజు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో నుంచి మోటర్, పైపులను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించారు. గ్రామస్థుల కథనం ప్రకారం రోజు మాదిరిగానే రాజు ఉదయం పొలం వద్దకు వెళ్లేసరికి బావిలోని మోటర్, పైపులు కనిపించలేదు. మోటార్ విలువ దాదాపు రూ. 40 వేల పైగా ఉంటుందని తెలిపారు.

కాపర్ వైర్ల చోరీ

గంగాధర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని చర్లపల్లి(ఆర్)లో వ్యవసాయ విద్యుత్ మోటర్ల కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని వరద కాలువకు సుమారుగా రెండు కిలోమీటర్ల మేర వ్యవసాయ మోటర్లతో రైతులు పొలాలకు సాగునీరందిస్తుంటారు. అయితే రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటర్లకు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ కాపర్‌వైర్లను దొంగిలిస్తున్నారని రైతులు వాపోయారు. పోలీసులు స్పందించి తమ మోటర్ల వైర్లను దొంగిలించిన వారిని గుర్తించి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయడం లేదు'

కరీంనగర్ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని విజయ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తన పేరిట ఉన్న గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయకుండా ఇతరులకు అమ్ముకుంటున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భగత్‌నగర్‌కు చెందిన వొడ్నాల వెంకటశ్రీనివాసరావు మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పేరిట ఉన్న గ్యాస్‌సిలిండర్ ఖాతా నంబరుతో ప్రతి నెలా ఓ యాప్ ద్వారా సిలిండర్‌ను బుక్ చేసుకుంటూ బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని బాధితుడు ఆరోపించారు. దీనిపై పోలీసులకు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన పేరిట గ్యాస్‌సిలిండర్ బుక్ చేసి బ్లాక్‌లో అమ్ముకుంటున్న గ్యాస్ ఏజెన్సీ డీలర్‌షిప్‌ను రద్దుచేసి, తనకు పరిహారం ఇప్పించాలని కోరారు. వీనిపై వినియోగదారుల ఫోరంనకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నడకతో సమూహమై... సమాజ హితమై

● అభాగ్యులకు అండగా ఖని వాకర్స్ ● రూ. పదిలక్షలకు పైగా బాధితులకు అందజేత

కోల్‌సిటీటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం మొదలైన నడక అందరి సహకారంతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేలా చేసింది. ఐదారు గురుతో మొదలైన ఈ నడక రోజురోజుకు సభ్యుల సంఖ్య పెరుగుతూ వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. వాట్సాప్‌లో సమాచారాన్ని అందిస్తూ ఎంతో కొంత డబ్బు జమ చేసి ఆపదలో ఉన్న వారికి అందజేస్తున్నారు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.

గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వాకింగ్ కోసం వచ్చిన వారు స్నేహితులై సమాజ హితం కోసం 2019 సంవత్సరంలో ఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఏర్పడింది. అలా మొదలైన ఈ వాకర్స్ అసోసి యేషన్ సేవలు నేటికి కొనసాగుతున్నాయి. మిత్రులకు, అభాగ్యులకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలుస్తోంది. గోదావరిఖని ప్రాంతంలోని అన్ని వర్గాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ఈ అసోసియేషన్‌లో ఉన్నారు. రోజు వాకింగ్ కోసం మైదానానికి వచ్చే వారిలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, పోలీసులు, సింగరేణి కార్మికులు, క్రీడాకారులు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాసరి రఘు అసోసియేషన్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సమష్టిగా ముందుకు వెళుతున్నారు. ఆపదలో ఉన్న విషయం తెలియగానే వెంటనే వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేసి సభ్యులకు సమాచారం ఇస్తున్నాడు. దీంతో సభ్యులందరూ స్పందించి తేచిన సాయాన్ని జమ చేసి బాధితులకు అందజేస్తున్నారు. ఇలా ఐదారేళ్ళుగా సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. స్టేడియం బాయ్ ఇంతియాజ్ కూతురు వివాహానికి రూ.లక్ష, నిరుపేద కూలి బాపు కుటుంబానికి రూ.1.30వేలు, భరత్ కుటుంబానికి రూ. 1,83 వేలు, నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. ఇలా ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు సాయం చేశారు.


స్టేడియం బాయ్ కూతురు వివాహానికి ఆర్థికసాయం అందిస్తున్న వాకర్స్ (ఫైల్)

సేవ చేయడంలో తృప్తి...



ఆరోగ్యం కోసం మొదలైన నడక ఇలా సేవకు మార్గం వేసింది. ఇందుకు అందరి సహకారం తోడైంది. మానవతా దృక్పథంతో ముందుకు వస్తూ తేచిన సహాయం అందిస్తున్నారు. వాటిని జమ చేసి అందరి సమక్షంలో ఇస్తున్నాం. ఇలా సేవ చేయడం చాలా తృప్తిగా ఉంది.

దాసరి రఘు, వాకర్స్ అసోసియేన్ కన్వీనర్

ఆరోగ్యం కోసం వెళితే ఆప్తులు...



ఆరోగ్యం కోసం మైదానం కోసం వెళితే ఆప్తులు దొరికారు. సేవా దృక్పథం కలిగిన స్నేహితులతో కలిసి తాను కూడా భాగస్వామినై తేచిన సాయం అందించడంలో తృప్తి ఉంది. రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేయడంలో ముందుంటాను.

చెన్నూరి వేణు, వ్యాపారి

సాయం చేయడంలో తృప్తి



ఆరోగ్యం కోసం పాతికేళ్ళుగా వాకింగ్ చేస్తున్నాను. చాలా మంది మిత్రులను మైదానం కలిపింది. అలా మైదానంలోని స్నేహితులందరం సమాజ హితం కోసం సేవ కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో నేను భాగస్వామిని కావడం తృప్తిగా ఉంది.

దీటి శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో చోరీ

జ్యోతినగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి నగదు, బంగారు, వెండి నగలు అపహరించారు. ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి పర్మినెంట్ టౌన్‌షిప్ లోని సీ-8/3 క్వార్టర్‌లో టీవీఆర్ చంద్ర, మరో ఇద్దరు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15వ తేదీన చంద్ర బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. అలాగే పక్కనే ఉన్న మరొక ఉద్యోగి ఇంట్లో అర కిలో వెండి నగలను అపహరించారు. మరొకరి ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఎలాంటి సొత్తు అపహరణకు గురి కాలేదు. దీంతో ఎన్‌టీపీసీ పోలీసులకు బాధితుడు చంద్ర సమాచారం అందించాడు. చంద్ర ఇంట్లో సుమారు రూ.15వేల రూపాయల విలువైన నగదు బంగారం, శ్రీనివాసరావు అనే ఉద్యోగి ఇంట్లో అరకిలో వెండి నగలు చోరీకి గురయ్యాయి.

పెద్దపల్లిలోని బంగారం షాపులో..

పెద్దపల్లి టౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి పైడ బజారులోని దేవరకొండ కరుణాకర్‌కు చెందిన బంగారు షాపులో చోరీ జరిగింది. 10 తులాల బంగారం, నాలుగు వేల రూపాయల నగదు దోచుకెళ్లారు. కరుణాకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై మల్లేష్ కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా మహిళగా గుర్తించి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ధర్మారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నర్సింగాపూర్, ఖిలావనపర్తి, ధర్మారం గ్రామాల్లోని వందల ఎకరాల ప్రభుత్వ అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితం నర్సింగాపూర్ సర్వే నంబర్ 273లో జరుగుతున్న భూ ఆక్రమాలను తహసీల్దార్ ఎండీ వకీల్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి భూ ఆక్రమదారులకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ధర్మారంలోని సర్వే నంబర్ 476తో పాటు ఖిలావనపర్తిలోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మానవహక్కులపై విద్యార్థులకు అవగాహన

ఇబ్రహీంపట్నం,మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మానవ హక్కులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల హెల్ప్ అసో సియేషన్ చైర్మన్ ఎండీ షలీం మాట్లాడుతూ రాజ్యాంగం మానవులు స్వేచ్ఛగా బతకడానికి ఎన్నో హక్కులను అందించిందన్నారు. ప్రతీ ఒక్కరు మనవ హక్కుల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పరాంకుశం నర్సయ్య, ఎండీ షాబీర్, హుస్సేన్, గంగాధర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి గల్లంతు


నరేష్(ఫైల్)

గొల్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాము నిపల్లెలో రిజర్వాయర్‌లోకి ఈతకు వెళ్లిన విద్యార్థి నరేష్ (12) చెరువు లో పడి మంగళవారం గల్లంతయ్యాడు. రంగదామునిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటి పూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రంగదామునిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరో చోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు.

ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడం తో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రిజర్వాయర్ వద్దకు వచ్చి స్థానిక జాలర్లతో బాలుడి కోసం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


విష్ణు (ఫైల్)

తంగళ్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మోగిలోజు విష్ణు(44) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం.. విష్ణు కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతుండగా కుమారుడికి రేచీకటి వ్యాధి, కూతురు మానసిక ఎదుగుదల లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పక్షవాతంతో పనిచేసే పరిస్థితి లేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కవిత, కూతు రు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై యువకుడి అత్యాచారం

సైదాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఓ గ్రామంలో 70 ఏళ్ల వృద్ధురాలిపై కరీంనగర్ పట్టణానికి చెందిన షేక్ ముక్తార్ (33) అనే యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ముక్తక్ ఖురేషి ఓ చికెన్ సెంటర్‌లో పనిచేసేందుకు తన కుటుంబంతో సహా కరీంనగర్ నుంచి ఎనిమిది నెలల క్రితం సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి వచ్చాడు. మూడు నెలలు చికెన్ సెంటర్‌లో పనిచేసిన తర్వాత అతని ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో యజమాని పనిలో నుంచి తొలగించాడు. అప్పటి నుంచి షేక్ ముక్తార్ అదే గ్రామంలో సొంతంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కొన్నిరోజుల క్రితం తన స్వస్థలమైన కరీంనగర్‌కు కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 10గంటల ప్రాంతంలో గ్రామానికి వచ్చి వృద్ధురాలిపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి కరీంనగర్‌కు వెళ్లిపోయాడు. బాధితురాలు సోమవారం తనపై షేక్ ముక్తార్ అత్యాచారం చేశారని సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయుడికి బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్ట్ అవార్డు


అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు

గంభీరావుపేట మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజసింగవరం ప్రభుత్వ పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు అక్కపెల్లి యాదగిరిగౌడ్ బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్టుగా అవార్డు అందుకున్నాడు. ఉగాది పండగ పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డును ప్రముఖ సినిమానటులు ఆర్ఎస్ నంద, సీతామాలక్ష్మి చేతుల మీదుగా ఉపాధ్యాయుడు యాదగిరిగౌడ్ అందుకున్నాడు. ఈ సందర్భంగా కళాకారులు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు యాదగిరి గౌడ్‌ను అభినందించారు.

రూ.7,240 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,240 రూపాయలు పలికింది. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 165 క్వింటాళ్లు విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర 7,240 రూపాయలు, కనిష్ఠ ధర .5700 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాలనీలోని హనుమాన్‌నగర్‌లో నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నాటుసారా విక్రయాలు జరుపుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు లావుడ్య రాజేశ్వరి ఇంటిలో సోదాలు నిర్వహించగా, 5 లీటర్ల నాటుసారా పట్టుబడినట్టు ఎస్సై తెలిపారు. నాటుసారా స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

మహిళలకు ఈ-ఆటో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ ఆటో(ఈ-ఆటో) డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ హైదారాబాద్ ఆధ్వర్యంలో నడుస్తున్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదారాబాద్‌లోని మోవో సోషల్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈ-ఆటో డ్రైవింగ్ ఉచిత శిక్షణను మహిళా ఇన్‌స్ట్రక్టర్స్ ద్వారా ఇవ్వనున్నట్లు వివరించారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు 50 మంది నిరుపేద గ్రామీణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళాలకు 45 నుంచి 60 రోజుల పాటు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఇప్పించేందుకు, మహిళలు ఈ-ఆటో కొనుగోలు చేసేందుకు రుణాలు లభించే విధంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల మహిళలు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎల్ఎండీలోని మహిళా ప్రాంగణ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 9347114396, 9849787823 నంబర్లకు సంప్రదించాలని సుధారాణి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం శివారులోని అటవీ ప్రాంతం నుండి జగిత్యాల జిల్లా బీమారం మండలం మోత్కులరావుపేటకు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు అటవీ శాఖ డిప్యూటీ రెంజ్ అధికారి రాఘవేంద్రరావు మంగళవారం తెలిపారు. అటవీ ప్రాంతంలో నుంచి విలువైన టేకు కలప తరలి వెళ్లుతుందన్న పక్కా సమాచారంతో అక్రమ టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్ను మోత్కులరావుపేట శివారు అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకుని, చందుర్తికి తరలించామన్నారు. అక్రమ కలపను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, అనిత, అటవీ శాఖ సిబ్బంది తిరుపతి, శంకర్‌లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 25,869 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు. పేకాట ఆడే వ్యక్తుల పై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ


పెద్దపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

పెద్దపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని, కూనారం రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం జిల్లాకు వచ్చిన సందర్భంగా సీపీఎం నాయకులు ఆయనకు చీకురాయి రోడ్డు వద్ద స్వాగతం పలికి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యల పై సర్వే చేస్తున్నామని, అనంతరం సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతున్నామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఒక బస్సు ప్రయాణం తప్ప మిగతావి అమలు జరగలేదన్నారు. గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, రాష్ట్ర నాయకులు బిక్షమయ్య, కోట రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు, జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, జి జ్యోతి, మండల కమిటీ సభ్యులు మోదంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, సీపెల్లి దిలీప్, నవీన్, వెంకటస్వామి, ఖాజా, రాజమల్లు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు కేసీఆర్ గతే..

కోల్‌సిటీ: బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారంతో నిర్బంధ పాలన చేశాడని, అతన్ని ప్రజలు ఇంటికి పంపారని, అదే విధానాన్ని కొనసాగిస్తే రేవంత్‌కు అదే గతి పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ప్రసంగించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నారని, సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసాను పూర్తి చేయడం లేదన్నారు. ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సేవకులకు వేతనాలు పెంచడం లేదన్నారు. అనంతరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకురాలు మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, బిక్షమయ్య, జిల్లా కార్యదర్శి యాకయ్య, నాయకులు ముత్యంరావు, రామాచారి, వేల్పుల కుమారస్వామి, సారయ్య, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై రామగుండంకు వచ్చిన జాన్‌వెస్లీకి

'గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిన పండ్లు, కూరగాయలు'

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిన పండ్లు కూరగాయలు ఇస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం నగరంలోని రాంనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో కుళ్లిన పండ్లను సరఫరా చేస్తూ, నాణ్యతలేని కూరగాయలను పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో నరేష్‌పటేల్, ప్రకాశ్, రాము, లక్పతి నవీన్, రాము నరేష్, రాజేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.


కుళ్లిన పండ్లను చూపిస్తున్న నాయకులు

పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

తంగళ్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు అప్పులు, మరో వైపు ఉపాధి లేక పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇందిరమ్మకాలనీ గ్రామానికి చెందిన పవర్‌లూం కార్మికుడు పరికిపెల్లి రాజు(65) సోమవారం రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మంగళవారం మృతిచెందాడు. రాజుకు భార్య పద్మ, కొడుకు రాకేశ్, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. రాజు మరమగ్గాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల, కొడుకుకు వివాహం జరిపించగా సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పులు అయ్యాయి. కొద్ది రోజులుగా పనిలేక ఇబ్బందులు పడుతూ మద్యానికి బానిసయ్యాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై బాత్‌రూం క్లీన్ చేసే యాసిడ్ తాగాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **కుటుంబాన్ని ఆదుకోవాలి..**

ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న రాజు కుటుంబానికి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. రాజు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కార్మికుల ఆత్మహత్యలు నివారించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు నెలకు 26వేల రూపాయల వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన 2023 యారన్ సబ్సిడీ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

జగిత్యాలరూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎస్‌కెఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు జ్ఞానసముపార్జనే కాకుండా, వినియోగ విశ్లేషణ కార్యక్రమాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇకముందుకూడా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాసవి, వరప్రసాద్, సంగీతరాణి, సుజాత, శ్రీలత,, నీరజ, జమున, సుస్మిత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్రం అవార్డులు



ప్రగతి చక్రం అవార్డులను అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మంగళవారం అధికారులు ప్రగతిచక్రం అవార్డులు ప్రదానం చేశారు. అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎం బి రాజు అవార్డులు అందించారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలకు చెందిన 56 మంది ఉద్యోగలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి వెంకటేశ్వర్‌రావు, ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ ఆర్ఎం

కరీంనగర్ రీజియన్ రీజినల్ మేనేజర్ బి రాజును బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి వెంకటేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

శాతవాహన పరిధిలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కరీంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 18,19లను సోమవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్‌లో లా కళాశాల ఏర్పాటు కు పచ్చ జెండా ఊపింది. ఈ రెండు కళాశాలలు రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి. హుస్నాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచ్‌లు ప్రారంభించనున్నారు. ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.44.12 కోట్లు కేటాయించగా అందులో రూ.29.12 కోట్లు ప్రస్తుతం మంజూరు చేశారు. మిగతా రూ.15 కోట్లను తర్వాత మంజూరు చేయనున్నారు. శాతావాహన వర్సిటీలో ఏర్పాటు చేయనున్న లా మూడేళ్ల కోర్సు, రెండేళ్ల కోర్సులో అడ్మిషన్లు ఇవ్వబోతున్నారు. ఈ కళాశాల నిర్మాణానికి మొత్తం రూ.22.96 కోట్లు కేటాయించారు. అందులో ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ.67.08 కోట్లను ప్రభుత్వం రెండు కళాశాలలకు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై శాతవాహన వీసీ ఉమేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఎమ్మెల్యేలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రాములోరి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించాలి

అధికారుల సమావేశంలో ఆర్డీవో రాజేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్‌రావు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించాలని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆర్డీవో రాజేశ్వరావు సూచించారు. వేములవాడ రాజన్న ఆలయంలోని గెస్ట్‌హౌస్ సమావేశం మందిరంలో అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మార్చి 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, కల్యాణానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయ ఈవో వినోద్ రెడ్డి మాట్లాడుతూ రామనవమికి వచ్చే భక్తులకు మంచినీటి సరఫరా, క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్లు, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు నిర్వహిస్తున్నమని తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ వారికి సూచించారు. మజ్జిగా ప్యాకెట్లు, అరటి పండ్లు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ వీరప్రసాద్, డీఈ రఘునందన్, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్ అధికారులు పాల్గొన్నారు.

'సూరమ్మ' కాలువల పనులు కొనసాగేనా?



- పరిహారం పెంచాలని రైతుల డిమాండ్
- పరిహారం కింద రూ.10 కోట్లు విడుదల
- మరో రూ.70 కోట్లకు ప్రతిపాదనలు
- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు

కథలాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులకు ఈ ఏడాది కూడా గ్రహణం పట్టే పరిస్థితులే కనిపిస్తున్నాయి. వానా కాలం మరో రెండు మాసాల్లో ఆరంభం కానున్న నేపథ్యంలో పనులకు సమయం మించి పోతోంది. అధికార యంత్రాంగం హడావుడిగా నష్ట పరిహారం చెల్లింపు కోసం గ్రామ సభలు నిర్వహించగా పలు గ్రామాల రైతుల నుంచి కాలువల నిర్మాణంపై నిరాసక్తత వ్యక్తమైంది. తమకు కాలువలే వద్దని కొందరు ఖరాఖండింగా చెప్పగా, మరికొంత మంది పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పనుల కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

520 ఎకరాల భూములకు నష్టపరిహారం

సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 45 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరందించాలని అప్పటి బీఆర్ఎస్ సర్కారు కాలువల తవ్వకానికి రూ.204 కోట్లు కేటాయించింది. వెన్నా అనే కంపెనీ ఈ పనులను దక్కించుకుంది. ఆరేళ్ల కిందటే సదరు కంపెనీ ఇసుకను ఇప్పపల్లిలో నిల్వ చేసుకుని క్యాంపు ఏర్పాటు చేసుకుంది. అయితే భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తో నష్టపరిహారం కోసం రూ.10 కోట్లు విడుదల చేసి పబ్లిక్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అధికారులు గ్రామాల వారీగా భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సమావేశాల్లో కొన్ని గ్రామాల రైతులు తాము చిన్న, సన్నకారు రైతులమని సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని పేర్కొంటూ భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. మరి కొన్ని గ్రామాల్లో పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పనుల కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది. మరో రూ.70 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.



కుడి కాలువకు సర్వే చేసి వేసిన హద్దులు

ఎకరానికి ప్రస్తుతం ఉన్న భూమి విలువ ప్రకారం చెల్లించాలని నిర్ణయించగా రైతుల నుంచి వచ్చే డిమాండ్లపై ఎలా స్పందిస్తార నేది వేచిచూడాలి.

ఈ కాలువల వల్ల కథలాపూర్ మండలంలోని కలికోటలో 48.31 ఎకరాలు, పోతారంలో 24.17, తాండ్ర్యాలలో 42.22, అంబారిపేటలో 73.03, దుంపెట 28.02, చింత కుంటలో 24.33, గంభీర్‌పూర్‌లో 50.04, ఇప్పపల్లిలో 39.11, పోసాని పేటలో 20.17 ఎకరాల చొప్పున రైతులు భూముల కోల్పోతున్నారు. మేడిపల్లి మండలంలోని దమ్మన్న పేటలో 05.06, బీమారంలో 22.18, మన్నెగూడెంలో 37.14, గోవిం దారంలో 104 ఎకరాల చొప్పున భూములకు నష్టం జరుగుతోంది. ఈ భూములకు పరిహారం కింద రూ.80 కోట్లు అవసర మని అధికారులు అంచనా వేశారు.



పరిహారం పెంచాలి

యాగండ్ల రమేశ్‌గౌడ్, దుంపెట

గౌడ సంఘం ఆధ్వర్యంలో 14 ఎకరాల్లో ఉపాధి కోసం ఈత చెట్లను పెంచుకున్నాం. మొక్కలు తెచ్చి డ్రిప్ ఏర్పాటు చేసుకుని అధిక వ్యయం చేసి పెంచుకున్నాం. కాలువలో దాదాపు 11 ఎకరాల భూమి కోల్పోతున్నాం. ఈత చెట్లనే నమ్ముకుని బతుకున్నాం. గుంటకు రూ.70 వేలు పరిహారం చెల్లించాలని వినతిపత్రం అందజేశాం.

ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక కవులు ముందుకు తీసుకెళ్లాలి

- సాహిత్యానికి ఆధ్యాత్మిక, కార్మిక క్షేత్రాలు పుట్టినిల్లులాంటివి
- కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్
- ఆధునిక సమాజంతో నడవకుంటే ఆగిపోవాల్సి వస్తుంది
- డాక్టర్ దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథం
- ఉత్సాహంగా ప్రారంభమైన రెండు రోజుల సాహిత్య జాతీయ సదస్సు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక కవులు ముందుకు తీసుకువెళ్లాలని, సాహిత్యానికి పుట్టినిళ్లుగా ఆధ్యాత్మిక, కార్మిక క్షేత్రాలైన వేములవాడ, సిరిసిల్లలు నిలుస్తున్నాయని కాళోజీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిరిసిల్ల మానేరు రచయితల సంఘం, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం సాహిత్య సమాలోచన రెండు రోజుల జాతీయ సదస్సును కవులు అందరు కలిసి జ్యోతిప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. సాయంత్రం డాక్టర్ నలిమెల భాస్కర్-సావిత్రి, జూకంటి జగన్నాథం-రమాదేవి దంపతులకు ఘనం గా ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం దూడం గణేష్ కవిత సంపుటి 'మాయ మైన మనిషి'ని ఆవిష్కరించారు. సదస్సులో నలిమెల భాస్కర్ మాట్లాడుతూ ఆధ్యా త్మిక, కార్మిక క్షేత్రాలైన సిరిసిల్ల, వేములవాడ గడ్డపైన ఎంతో మంది గొప్ప కవులు, రచయితలు వెలుగొందారన్నారు. తమ స్వగ్రామమైన నారాయణపూర్ నుంచి తనకు సాహిత్యం అబ్బిందని, కవులకు తమ ఊరు అప్పట్లోనే పెట్టిందిపేరన్నారు. పుస్త కాలను చూస్తే ఎంత ఉత్తేజం వస్తుందో.. పిల్లలను చూస్తే అంతే ఉత్తేజం వస్తుందని సూచించారు. ఒకప్పుడు మనుషులను చూసి రాళ్లు ఏడ్చేవని.. ప్రస్తుతం రాళ్లను చూసి మనుషులు ఏడుస్తున్నారన్నారు. ఇక్కడ రాళ్లను తీసుకువెళ్లి చైనాలో పడేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి మాటలు మాట్లాడితే అర్బన్ నక్సలైట్ అంటారని, సంప్రదాయ మాటలు మాట్లాడితే సంప్రదాయపు కవిగా ముద్రవేస్తారని వివరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం కవులు, రచయితలు

జూకంటి జగన్నాథం మాట్లాడుతూ సంపద సృష్టించబడిన చోట ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. మారుతున్న గ్లోబలైజేషన్‌తో పాటుగా నేటి యువత ప్రతి దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ లోకానికి సూర్యచంద్రులు ఎలాగో మనకు నలిమెల, జూకంటి ఇద్దరు అలాంటి వరని కొనియాడారు. దక్షిణ ప్రాంత ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ మానేరు, మూలవాగు పరివాహ ప్రాంతాల్లో ఎంతో మంది కవులు వెలుగొందారని గుర్తు చేశారు. సదస్సు కన్వీనర్, తెలుగు శాఖ అధ్యక్షురాలు శారద మాట్లాడుతూ ప్రాచీన కళలకు పెట్టింది పేరు ఈ ప్రాంతం అన్నారు. కవి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ భాషకు, కవిత్వానికి ఇద్దరు బ్రాండ్ అంబాసిడర్‌లు అని కొనియాడారు. ఈ సదస్సు సంచాలకులుగా అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్, సదస్సు సహ సంచాలకుడిగా డాక్టర్ సిరిసిల్ల చందన, సదస్సు కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షుడు కటుకం శారద, మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీ.వీ. నారాయణ, విమర్శకులు ఎం. నారాయణ శర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, కవులు, రచయితలు హాజరయ్యారు.

వేములవాడకు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



నిరంజన్‌కు స్వాగతం పలుకుతున్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ. నిరంజన్, బీసీ కమి షన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమల గిరి సురేందర్‌లు మంగళవారం రాత్రి వేములవాడ ఆలయానికి చేరుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వీచ్చేసిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. వారి వెంట ఆర్డీవో రాజేశ్వర్‌రావు, ఈవో వినోద్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఇల్లంతకుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని పయ్యావుల వైష్ణవి జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. వికారాబాద్‌లో జరిగిన 34వ రాష్ట్రస్థాయి పోటీలలో వైష్ణవి ఉత్త మ ప్రతిభ కనబర్చింది. ఈనెల 27నుంచి జాతీయస్థాయి పోటీలు బీహార్ రాష్ట్రంలో జరుగనున్నాయి. జాతీయస్థాయి పోటీల కు ఎంపిక కావడంపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మామిడి శ్రీనివాస్, సాన బాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గాదె స్వప్న, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

చొప్పదండి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలను సీబీఎస్ఈ మంగళవారం విడుదల చేసింది. గత జనవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది వేల మందికిపైగా విద్యార్థులు రాయగా, 80 మందిని ఎంపిక చేస్తూ జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందించనున్నట్లు చొప్పదండి నవోదయ ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. తొమ్మిదవ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. 14 మంది విద్యార్థులను ఎంపిక చేస్తూ జాబితాను ప్రకటించారు. వివరాలకు https:// cbseit.in/cbse/2025/nvs_result/Result.aspx వెబ్‌సైట్‌లోగాని విద్యాలయంలో గాని సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గుమ్లాపూర్ విద్యార్థిని ఎంపిక...

నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన పెరుమాండ్ల ప్రశస్తి ఎంపికయింది. ప్రశస్తిని సీఐ ప్రకాశ్, ఎస్ఐ సురేందర్ అభినందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు పదిహేను వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధి కారులు పర్య వేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి. కాగా రెండు రోజులుగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

బద్దిపోచమ్మకు బోనం మొక్కులు

ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలు పెట్టి ఒడి బియ్యం పోసి అమ్మవారిని దర్శించుకుని పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుంటూ కళ్లసాకతో మొక్కులు చెల్లించు కున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుం డా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చల్లని తాగునీరును భక్తులకు అందజేశారు. ఆలయ ఉద్యోగులు ఎప్పటికప్పుడు క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా చర్యలు తీసుకున్నారు.



రాజన్నను దర్శించుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న ఆలయ రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. స్వామివారి నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, పీఆర్వో శ్రీకాంతచారీలు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఐడియా అదిరింది..



మత్తడి నుంచి పైపుల ద్వారా దిగువకు వస్తున్న నీరు



కొడిమ్యాల వాగులో నీటి ప్రవాహం

- మైసమ్మ చెరువు మత్తడి వద్ద చేరిన నీరు
- పైపుల సహాయంతో దిగువకు తరలిస్తున్న రైతులు
- పెరిగిన భూగర్భ జలాలు

కొడిమ్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. వాగులు, వంకలు ఎండిపోయాయి. యాసంగి పంటలకు సాగు నీరందడం కష్టంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కొడిమ్యాల మండల రైతులు ఓ ఆలోచన చేసి ఎటువంటి విద్యుత్ మోటార్ లేకుండా పైపుల ద్వారా దిగువకు నీటిని మరలించి విజయం సాధించారు.

సొంత డబ్బులతో..

కొడిమ్యాల మైసమ్మ చెరువులో నీరున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి నుంచి నీరు దిగువకు వెళ్లి వాగులో సమృద్ధిగా పారుతుండేది. ఎండలు పెరిగిపోవడంతో మత్తడి పైనుంచి నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో వాగులో జలాలు పూర్తిగా ఎండిపోయాయి. సాగునీటికి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రైతులందరూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మత్తడి సమీపంలో నీరున్నా దిగువకు రాకపోవడంతో ఒక ఆలోచన చేశారు. రైతులు డబ్బులు జమ చేసి 40 పైపులు కొన్నారు. వాటిని ఎగువన ఉన్న మత్తడి వద్ద ఉన్న నీటిలో ఉంచి దిగువకు మరలించారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో ఎటువంటి మోటర్ సహాయం లేకుండా గ్రావిటీ ద్వారా నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో వాగు జలకళను సంతరించుకుంది. ఈ నీటితో కొడిమ్యాల, పూడూర్ పెద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలలో నీరు చేరింది. సుమారు 500 ఎకరాలకు నీరందింది. మైసమ్మ చెరువు నుంచి వాగుకి ఇరువైపుల వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగింది. చెక్‌డ్యాంలకు నీరు చేరడంతో తాము ఎదుర్కొన్న సాగు నీటి కష్టాలు తొలగిపోయాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలోనూ పశువులకు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి పైపులు వేసుకోవటానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, నీటిపారుదలశాఖ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



నీటితో కళకళలాడుతున్న చెక్‌డ్యాం

సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు అడ్డంకి

(5వ పేజీ తరువాయి)

మంత్రులు ఊదర గొడుతున్నారే గానీ కార్డులు మాత్రం ఇవ్వక పోవడంతో ఆయా పథకాలకు అర్హులైన వాళ్లు సంక్షేమ ఫలాలను అందుకోలేక పోతున్నారు. రేషన్ కార్డు లేక అనేక మంది 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500లకు సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం ఇలా ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందలేక పోతున్నారు. తాజాగా రాజీవ్ యువ వికాసం పథకానికి కూడా రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించడంతో కార్డులు లేని వాళ్లు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డుల కోసం జిల్లాలో సుమారు 20 వేల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్వరమే రేషన్ కార్డులను జారీ చేసి రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువును మరో 15 రోజులు పొడిగించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఈ విషయమై ఆంధ్రజ్యోతి జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రాజేందర్‌ను వివరణ కోరగా, 'రేషన్ కార్డుల కోసం తమకు వచ్చిన దరఖాస్తులను, మీ సేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి వారి వివరాలను ప్రభుత్వానికి పంపించాం. కానీ ఇంకా అర్హులైన వారి ఎంపిక జరగ లేదు. ప్రభుత్వం నుంచి అర్హులైన వారి జాబితా రాగానే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తాం' అని తెలిపారు.

ఈఎస్ఐ ఆసుపత్రికి వైద్యుడిని నియమించాలి



మేనేజర్ బికెరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాలకుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంటు కంపెని ఈఎస్ఐ ఆసుపత్రికి ప్రధానవైద్యుడిని నియమించాలని మంగళవారం కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ బికెరావుకు వినతిపత్రం అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కర్మాగారంలో 800 మంది కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో సరైన వైద్యసేవలు అందడం లేవన్నారు. నాలుగేళ్ళుగా డాక్టర్ లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైద్యుడిని నియమించకుంటే ఆందోళనలు చేపడుతామని తెలిపారు. బత్తిని సతీష్‌గౌడ్, వేల్పుల సంపత్‌యాదవ్, ముల్కనూర్ శ్రీధర్, కండె స్వామి, పూసాల ప్రసాద్, మంత్రి శంకర్, పాల్గొన్నారు.

నవోదయ సీటు సాధించిన విద్యార్థి



విజ్ఞాన్

ధర్మారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సాయి మణికంఠ మోడ్రన్ స్కూల్ విద్యార్థి రాపెల్లి విజ్ఞాన్ చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించారు. 6వ, తరగతిలో ప్రవేశానికి జనవరి 18న పరీక్ష నిర్వహించగా మంగళవారం ఫలితాలు విడుదలయ్యాయి. విజ్ఞాన్‌ను పాఠశాల ఎండీ జైన రమాదేవి, కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆరోపణలు నిరూపిస్తే కోటి

బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ నాయకుల సవాల్

కళ్యాణ్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో ఇసుక, బూడిద, భూదందాలు నడుస్తున్నాయంటూ బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, నిరూపిస్తే బీఆర్ఎస్ నాయకులకు కోటి రూపాయలు ఇస్తానని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దాసరి విజయ్ సవాల్ విసిరారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రజాపాలన చేస్తుంటే కొందరు ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, కాంగ్రెస్ నాయకులపై ఇష్టంవచ్చినట్టు మాట్లాడుతున్నారని, ఆరోపణలను నిరూపిస్తే కోటి రూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. గతంలో రామగుండంలో ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల దందా, బూడిద దందా జరిగింది ప్రజలకు తెలుసునని, గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పినా నాయకుల తీరు మారడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ పద్ధతులు మార్చుకోవాలన్నారు. నాయకులు కుడుదుల శివ, దండ కనకయ్య, శ్వేత, లక్ష్మీ, భాగ్య, రాజేశ్వరి, కళావతి, తిరుమల, సరస్వతి, శారద, దేవి, అరవింద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో జేఎన్టీయూ విద్యార్థుల ప్రతిభ



షీల్డ్‌తో జేఎన్టీయూ విద్యార్థులు

రామగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హుజురాబాద్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి కిట్స్‌జెన్ పోటీల్లో మంథని జేఎన్టీయూ కళాశాల బాలుర జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. అలాగే షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. విజేతలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో జరిగే టోర్నమెంట్‌లో గెలిచి కళాశాలకు పేరు తేవాలన్నారు. పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు సాక్ష్యంతో అట్రాసిటీ కేసు పెట్టారు

మంథని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముత్తారం పోలీసు స్టేషన్‌లో అధికార పార్టీ నేత మద్దెల రాజయ్య తన పై కుట్ర పూరితంగా తప్పుడు సాక్ష్యం చెప్పించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయించారని రైతు నాయకుడు తీర్థాల కొమురయ్య మంగళవారం ఆరోపించారు. గతంలో ఇబ్బందులకు గురి చేసిన మద్దెల రాజయ్య, ఆర్ఐ శ్రీధర్‌పై తాను పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మరుసటి రోజు మద్దెల రాజయ్య తన పై కుట్ర పూరితంగా తప్పుడు ఫిర్యాదు చేశాడన్నారు. ముగ్గురు వ్యక్తులు చెప్పిన సాక్ష్యంతో తప్పుడు కేసులో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

గ్రామాల్లో ఘనంగా ఎల్లమ్మ బోనాలు



రామగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల, బేగంపేట్ గ్రామాల్లో మంగళవారం ఘనంగా ఎల్లమ్మ బోనాలు జరిగాయి. మహిళలు డప్పుల చప్పుళ్ళ మధ్య బోనంతో గ్రామంలో ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి తరలివెళ్ళారు. బోనంను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆశా వర్కర్ల ఆందోళన



పెద్దపల్లి, ఓదెలలో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

పెద్దపల్లి టౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆశా వర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.జ్యోతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లు ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులు చెల్లింపు, అధిక పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలయ్యే వరకు ఆశా వర్కర్లు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రేణుక స్వప్న, రాధ, వెంకటేశ్వరి, తిరుమల, పద్మ, లత, శోభ, సరోజ, అనూష, రాజేశ్వరి, రజిత పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలపై పోలీసు దాడులను నిరసిస్తూ రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లిన ఆశా కార్యకర్తలపై దౌర్జన్యం చేయడం సమంజసం కాదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకే పోరాడుతున్నామని, ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించకుండా మహిళలపై పోలీస్‌లు దాడులు చేయడం అప్రజాస్వామ్యమని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ కార్యాలయం ఎదుట మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సువర్ణ, పద్మ, నీరజ, శివలీల, అప్సనాతో పాటు పలువురు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాడుతున్న ఆశాకార్యకర్తలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు.

వారు మాట్లా డుతూ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమృత, బర్ల రమాదేవి, దేవి మల్లేశ్వరి, తనుకుల విజయ, గొట్టె రాజేశ్వరి, శిలారపు కళ్యాణి, బేద కృష్ణవేణి, బంక శ్యామల, పంతకాని పుష్పలత, మేకల గౌతమి, చిప్పకుర్తి స్వరూప, బర్ల స్వప్నలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టులో ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇజ్రాయెల్ న్యాయవాది హత్యను నిరసిస్తూ గోదావరిఖని న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు బహిష్కరించిన న్యాయవాదులు మున్సిఫ్‌కోర్టు కాంప్లెక్స్ ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాదిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బార్ అసో సియేషన్ అధ్యక్ష కార్య దర్శులు తౌటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, గోషిక ప్రకాష్, పులిపాక ప్రవీణ్ కుమార్, వరలక్ష్మి, శైలజ, గొర్రె రమేష్ పాల్గొన్నారు.

మంథని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయెల్ హత్యకు నిరసనగా మంథని కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాది హత్యను ఖండించారు. ఇజ్రాయెల్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అడ్వకేట్స్ ప్రొటక్షన్ యాక్టును అమలులోకి తీసుకురావాలని న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్‌రెడ్డి, కోశాధికారి అంజనేయులు, న్యాయవాదులు శశికాంత్‌కాచే, రమేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, శశిభూషణ్‌కాచే, శేఖర్, ఆర్ల నాగరాజు, శుభాష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శికి వినతి

రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ప్రతినిధులు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కోరారు. మంగళవారం గోదావరిఖనికి వచ్చిన ఆయనకు వినతి పత్రం అందజేశారు. చందాల శైలజ, గోషిక ప్రకాష్, ఆసంపల్లి రవి, ప్రదీప్, పులిపాక ప్రవీణ్, మహేందర్, నూతి సురేష్, పెట్టెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

- మాల ధరించి వచ్చిన విద్యార్థి
- ఆరుబయట నిలబెట్టిన యాజమాన్యం

పెద్దపల్లిటౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వచ్చిన విద్యార్థి పట్ల సెయింట్ ఆన్స్ పాఠశాల సిబ్బంది అవమానకరంగా ప్రవర్తించారని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో మంగళవారం ఆందోళనకు దిగారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని యూనిఫాంలో రావాలని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు గంటల పాటు తరగతి బయట నిలబెట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది బాలుడి తండ్రికి ఫోన్ చేసి బాలుడిని ఇంటికి తీసుకు వెళ్ళాలని సూచించారు. ఈ విషయమై తల్లిదండ్రులు పాఠశాల వద్ద సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు సిబ్బందితో మాట్లాడగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవ రెడ్డి మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఉన్న బాలుడిపట్ల అవమానకరంగా ప్రవర్తించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటామని పాఠశాల హెడ్ మాస్టర్ క్షమాపణలు తెలిపారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లక్ష్మన్ కుమార్‌రావులు నచ్చజెప్పి పంపించారు. పల్లె సదానందం, వెళ్లంపల్లి శ్రీనివాస రావు, చక్రధర్ రెడ్డి, మేకల శ్రీనివాస్, రాజం మహంత, తూడి రవి, శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు జాబ్‌మేళా

పెద్దపల్లి కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు అపోలో ఫార్మసీలో ఉద్యోగాలకు ఈనెల 27న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 ఫార్మ సిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటై ల్ ట్రైనీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఫార్మ సిస్ట్ ట్రైనింగ్ ఫార్మసిస్ట్ పోస్టులకు బీఫార్మసీ లేదా డిప్లొమా, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. 18నుంచి 35 ఏండ్ల లోపు ఉండాలని, ఆసక్తి ఉన్నవారు ఉదయం 11గంటలకు సర్టిఫికేట్స్ జిరాక్స్‌లతో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని, వివరా లకు 8247656356, 8985336947, 812126 2441నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపా ధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు జూలపల్లి వారసంత వేలం

జూలపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే అంగడి(వారసంత) వేలం పాటను బుధవా రం ఉదయం 10గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఎండి ముజీబ్ తెలిపారు. పంచా యతీకి బకాయిలు లేని వారు అర్హులని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు చెల్లించాలని, సంతను దక్కించుకున్న వారు సగం డబ్బు చెల్లించి అనుమతులు పొందాలని కార్యదర్శి వివరించారు.

ఉచిత వైద్య శిబిరం

ధర్మారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బొమ్మరెడ్డిపల్లిలో సన్‌రైజ్, స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య తిరుపతిరెడ్డి, ఆర్ఎంపీ వైద్యుడు మునీందర్‌తో కలిసి ప్రారంభించారు. మొత్తం 450 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించగా అందులో 170 మంది పిల్లలు ఉన్నారు. డాక్టర్లు దామోదర్, సాయి కృష్ణ, ఫౌజియా బేగం, వర్షిని క్యాంపు మేనేజర్ కొత్తూరు రాజేందర్, కో ఆర్డినేటర్ క్యాతం సతీష్, మార్కెటింగ్ ఇంచార్జ్ బాలు, పీఆర్‌ఓ తిరు పతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలి

మంథని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎస్ఎంఏఎం పథకం ద్వారా వ్యవసాయ యాంత్రీకరణకు మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మంథని ఏడీఏ ఎన్.అంజనీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యంత్రీకరణ ద్వారా బ్యాటరీ స్ప్రేయర్లు, చేతి పంపులు, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్, పవర్ టిల్లర్, బ్రష్ కట్టర్, పవర్ వీడర్ రోటోవేటర్, కల్టివేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కల్గిన మహిళలు రైతులు వారికి సమీపంలోని మండల వ్యవసాయాధికారుల దగ్గర దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు జంతర్ మంతర్ వద్ద ధూందాం

ధర్మారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని 'కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో' సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ వద్ద బుధవారం ధూందాం నిర్వహిస్తామని సాధన సమితి జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లి స్వామి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యతో పాటు బీదా మస్తాన్‌రావులను మంగళవారం ఆహ్వానించారు. జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురాం, పలిగిరి కనకరాజు, బొంకూరి కైలాసం, తాడెం అనీల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయం హుండీ లెక్కింపు

మంథని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మి నారాయణస్వామి ఆలయంలోని హుండీని గురువారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఎండోమెంట్ మేనేజర్ రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

29న తైబజార్ వేలం

మంథని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో 2025-26 సంవత్సరగాను తైబజార్, స్లాటర్ హౌజ్‌లను ఈనెల 29న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్‌కు వేలం పాల్గొనే వారు రూ.50 వేలు, స్లాటర్ హౌజ్‌కు రూ.10 వేల విలువగల డీడీలను ఏదైనా బ్యాంక్ నుంచి కమిషనర్ మున్సిపల్ పేరిట తీసి ఈనెల 28న సాయంత్రం 4 గంటలకు కార్యాలయంలో అందజేయాలన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం నియామకం



కడారి అశోక్ రావు



జక్కుల నరహరి

పెద్దపల్లి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా అమరగాని ప్రదీప్‌కుమార్, కాసాగోని నిర్మల (పెద్దపల్లి), ముస్కుల భాస్కర్ రెడ్డి (రామగుండం), మత్స్యగిరి రాము (మంథని), ప్రధాన కార్యదర్శులుగా కడారి అశోక్‌రావు (సుల్తానాబాద్), కోమల్ల మహేష్ (రామగుండం), పల్లె సదానందం (పెద్దపల్లి కొత్తపల్లి) నియమించినట్లు తెలిపారు. కార్యదర్శులుగా జంగా చక్రధర్ రెడ్డి, మౌటం నర్సింగం(పెద్దపల్లి), బిరుదు గట్టయ్య (మంథని), కంకనాల జ్యోతిబసు(జూలపల్లి), అధికార ప్రతినిధులుగా శనిగరపు రమేష్(ఓదెల), పిలుమర్రి సంపత్(మంథని ముత్తారం), జక్కుల నరహరి(గోదావరిఖని), జిల్లా కమిటీ సభ్యులుగా కుర్రె రాజేందర్, పెద్దల్ల ఐలయ్య, కొల్లూరి మధునయ్య, మొలుగూరి రవీందర్, ఏగోలపు శ్రీనివాస్ గౌడ్ లను నియమించామని పేర్కొన్నారు. జిల్లా యువ మోర్చా అధ్యక్షుడిగా పిన్నింటి విశాల్(పెద్దపల్లి), కిసాన్‌మోర్చ అధ్యక్షుడిగా గూడెపు జనార్దన్‌రెడ్డి (కాల్వ శ్రీరాంపూర్), ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా చాత్రాజు రమేష్ (సుల్తానాబాద్), దళిత మోర్చా అధ్యక్షుడిగా మచ్చ విశ్వాస్(గోదావరిఖని) లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మండలం నుంచి ముగ్గురికి చోటు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ నాయకులు కడారి అశోక్ రావును నియమించారు. నీరుకుళ్ల గ్రామానికి చెందిన సొదరి మహేందర్ యాదవ్‌ను జిల్లా కార్యదర్శిగా నియమించారు. కొదురుపాక గ్రామానికి చెందిన మరో సీనియర్ నాయకులు చాతరాజు రమేష్‌ను బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. మండలం నుంచి ముగ్గురికి జిల్లా కార్యవర్గంలో పదవులు దక్కాయి. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కడారి అశోక్‌రావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అధికార ప్రతినిధిగా నరహరి

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా గోదావరిఖనికి చెందిన జక్కుల నరహరిని నియమించారు. 1994 నుంచి బీజేపీలో చేరిన నరహరి అనేక పదవులను చేపట్టగా జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. నియామకం కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు



జయ్యారంలో వంగిన మిషన్ భగీరథ ప్రధాన పైపు

పాలకుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జయ్యారం గ్రామస్థులకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ వంగి పోవడంతో పాతవాడ, నేతకానిగూడెం, ఇందిరమ్మకాలనీ, మాలవాడకు చెందిన కాలనీవాసులు తాగునీరు అందక ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం గ్రామస్థులు తాగునీరు అందడం లేదని పంచాయతీ కార్యదర్శి సాయిచరణ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శి వారం రోజుల క్రితం మిషన్ భగీరథ అధికారులకు సమస్యను వివరించారు. స్పందించిన గ్రిడ్ ఏఈ మురళి, డీఈ సునీల్, ఈఈ శ్రీనివాస్, డీపీవో బుచ్చయ్య, ఇంట్రా ఏఈ అఖిల, ఎంపీడీవో కలికోట రామ్మోహనచారి, ఎంపీవో ఉప్పు సుదర్శన్‌లు ఈనెల 19న గ్రామాన్ని సందర్శించారు. ప్రధాన ట్యాంకు నుంచి ఇంటింటికి మిషన్ భగీరథ నీరు అందకపోవడానికి గల కారణాలను పరిశీలించారు. హనుమాన్ దేవాలయం సమీపంలో ప్రధాన పైపులైన్ నిర్మాణం చేస్తున్నప్పుడే వంగి పోవడాన్ని గుర్తించి తవ్వకాలు చేపట్టారు. కాగా కార్యదర్శి సాయిచరణ్ మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను గుర్తించామని. మరమ్మతు పనులు చేపట్టి తాగునీరు అందిస్తామన్నారు.


మతిస్థిమితం లేని మహిళ ఆశ్రమానికి తరలింపు

పెద్దపల్లి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ఎంబి గార్డెన్ పక్కన మతిస్థిమితం లేని మహిళను మంగళవారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో హైదారాబాద్ అమ్మానాన్న ఆశ్రమానికి తరలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ స్వప్నలు పరిశీలించారు. స్థానికుల సహాయంతో మహిళకు స్నానం చేయించి, కొత్త దుస్తులు ధరించి అల్పాహారం అందజేసి హైదారాబాదుకు తరలించారు. సఖీ కేంద్రం ఐటీ శ్రీనివాస్, సెక్యూరిటీ సందీప్, మల్టిపర్పస్ వర్కర్ కవిత, ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, కానిస్టేబుళ్లు సుజాత, శ్రీలత ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కమాన్‌పూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిస్థాయిలో చేయాలని డీపీవో కే.సతీష్ అన్నారు. మంగళవారం ఆదర్శనగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యదర్శి అంబటి శంకర్, కారోబార్ బర్ల భూమయ్య పాల్గొన్నారు.

ఆర్‌జీ-1 ఏరియాలో 29మందికి కారుణ్య ఉద్యోగాలు



ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మెడికల్ ఇన్ వాలిడేషన్, చనిపోయిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల డిపెండెంట్స్ 29మందికి మంగళవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో జీఎం లలిత్ కుమార్ కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. జీఎం మాట్లాడుతూ సీఎండీ ఎన్ బలరాం చొరవతో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించామన్నారు. వీరికి ఆర్‌జీ-1 ఏరియాలో పోస్టింగ్ ఇచ్చారన్నారు. సింగరేణి భవిష్యత్ యువ ఉద్యోగుల చేతులలో ఉందని, ప్రతీ ఒక్కరు పనినే ప్రత్యేక దైవంగా భావించి విధులకు హాజరు కావాలని, ఉద్యోగ అవకాశం కల్పించిన తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం (పర్సనల్) కిరణ్ బాబు, సీఎంఓఏఐ అధ్యక్షుడు మల్లేష్, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీమడ్డి ఎల్లయ్య, బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పీఓ హనుమంతరావు, సీనియర్ పీఓలు శ్రావణ్ కుమార్, హనుమంతరావు, నాయకులు రంగు శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు అరియర్స్ చెల్లింపు

గోదావరిఖని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 11వ వేజ్ బోర్డు కాలపరిమితిలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, కార్మికులకు పెన్షన్‌ను, అరియర్స్ చెల్లింపునకు సీఎంపీఎఫ్ అధికారులు చర్యలు తీసుకున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్‌జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత కొత్త పెన్షన్లకు సంబంధించిన వ్యత్యాసం, ఏరియర్స్‌కు సంబంధించి కూడా నిర్ణయం తీసుకుంటూ అమలు కోసం ఆదేశాలు జారీ చేశారన్నారు. సవరించిన పెన్షన్‌ను ఏప్రిల్ నుంచి చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారని, అదేవిధంగా సవరించిన పెన్షన్ ఏరియర్స్ చెల్లించాలని కోరామన్నారు.

సమష్టి కృషితోనే నిర్ధేశిత వార్షిక లక్ష్యం

రామగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే నిర్ధేశిత వార్షిక లక్ష్యాన్ని సాధించామని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌కు నిర్ధేశించిన 2024-25 వార్షిక లక్ష్యాన్ని వారం రోజుల ముందుగానే చేరుకున్నామని పేర్కొన్నారు. డివిజన్‌కు నిర్ధేశించిన 62.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని వంద శాతం సాధించినట్లు తెలిపారు. ఉద్యోగులలందరిలో చైతన్యం కల్గిస్తూ ప్రోత్సాహం అందించిన సీఎండీ బలరామ్, దిశానిర్ధేశంతో డైరెక్టర్స్ సత్యనారాయణ, సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లులకు ధన్యవాదాలు తెలిపారు.



కాంగ్రెస్‌తోనే సింగరేణి పరిరక్షణ



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం కార్పొరేట్ సంస్థలకు అప్పగించడాన్ని ఐఎన్‌టీయూసీ వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. సింగరేణిని బలో పేతం, కార్మిక సమస్యల పరిష్కారం దిశగా ఐఎన్‌టీయూసీ పని చేస్తోందన్నారు